# చలికాలం.. తప్పదు జాగ్రత్త !

- చలి తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ఆస్తమా వ్యాధిగ్రస్తులు
- ఆదోని ఆసుపత్రికి రోజూ 20 నుంచి 30 మంది బాధితులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- డాక్టర్ల సూచన మేరకే మందులు వాడాలి



ఆదోని ఏరియా ఆసుపత్రిలో ఓపీ కౌంటర్ వద్ద వేచివున్న ప్రజలు

ఆదోని సెంట్రల్: గత పది రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోవడం, చల్ల గాలులు వీస్తుండటంతో ప్రజలు ఎక్కువగా జలుబు, దగ్గుతో పాటు శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆస్తమా ఉన్నవారు శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ల సలహాలు, సూచనల మేరకు నడుచుకుంటే అస్తమాను అదుపులో పెట్టుకొనవచ్చని వైద్యులు చెబుతున్నారు. దీనికి అవసరమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

**రోజుకు 20 నుంచి 30 మంది బాధితులు**

ఆదోని డివిజన్ పరిధిలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. దీనికి తోడు తుపాను ప్రభావం ఉండటంతో గత పదిరోజులుగా కనిష్ట ఉష్ణోగ్రత 17, 18 డిగ్రీల మధ్యనే నమోదవుతోంది. పగటి వేళలోనూ వాతావరణం చల్లగా ఉంటోంది. ఆదోని ఏరియా ఆసుపత్రిలో రోజుకు 500 నుంచి 550 దాకా పేషెంట్లు వస్తున్నారు. ఇందులో 50 నుంచి 60 వరకు ఉపిరితిత్తుల విభాగానికి ఓపీ వస్తుండగా.. ఇందులో ఆస్తమాతో బాధపడేవారు 20 నుంచి 30 మంది దాకా ఉంటున్నారు. ముఖ్యంగా పది మందిలో ఆరు ఎడు మంది జలుబు, వైరస్ వంటి సమస్యను ఎదుర్కొంటున్నారు. చిన్న పిల్లలు మొదలుకొని పెద్దలు, వృద్ధులు వరకు ఈ సమస్య కనిపిస్తు ఉంది.

**ఆస్తమా లక్షణాలు..**

మనం పీల్చే గాలిని శరీరంలోకి పంపే అవయవమే ఉపరితిత్తులు. మనిషి నీరు లేకుండా కొన్ని గంటలైన జీవించగలడు కాని గాలి లేకుండా జీవించ లేడు. అందుకే గాలిని ప్రాణవాయువు అన్నారు. ఈ ప్రాణవాయువును పంపే ఉపరితిత్తులకు వచ్చే ప్రధానమైన జబ్బు ఆస్తమా(ఉబ్బసం) ఇది వచ్చిన మనిషి గాలిని తీసుకోవడానికి ఇబ్బంది పడుతాడు. చలి పెరిగిందంటే శ్వాసతీసుకోవడం కష్టమవుతుంది. అస్తమా ఉన్నప్పుడు శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. వ్యాధి సోకిన వారిలో ఒక్కొక్కరికి ఒక్కో విధంగా లక్షణాలు ఉంటాయి. కొంతమందికి రాత్రిపూట, మధ్యరాత్రి, తెల్లవారు జామున తీవ్రమైన పొడిదగ్గు వస్తుంది. ఛాతీ కూడా బిగబట్టినట్లు ఉంటుంది. నడిస్తే ఆయాసం వస్తుంది. కూర్చున్నా, పడుకొన్న దగ్గ ఆయాసం వస్తుంది. భయం, ఆందోళన కలవరపెడుతుంది. ఆస్తమా తీవ్రత పెరిగినపుడు నిబ్బరంగా ఉండాలి. గబారపడకూడదు. ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించాలని వైద్యులు సూచిస్తున్నారు.

**వ్యాప్తి ఇలా..**

ఆస్తమా బాధితులు వర్షాకాలంలో ఒక రకంగా ఉంటే చలి కాలంలో ఎక్కువగా ఉంటారు. దుమ్ము, ధూళితో పాటు వాహనాల కాలుష్యం, వాతావరణ మార్పుల వల్ల అస్తమా సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా సిగరెట్లు, బీడీ, పొగ. వాసనలు, దుర్గంధం, సెంట్లు, స్ప్రేలు, శీతలపానీయల వంటి వాటితో అస్తమాకు దారి తీస్తాయి. కొంత మందికి మందుల వల్ల వస్తే మరికొంత మంది పుప్పొడి రేణువులు, సరిపడని అహారం ద్వారా వచ్చే అవకాశం ఉంది. మరి కొందరికి చల్లటి గాలుల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా పెంపుడు జంతువుల నుంచి కూడా వ్యాప్తి చెందే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువగా వాతావరణం మార్పులతో పాటు మనదైనందిన జీవితంలో ఆహారపు అలవాట్ల ద్వారా కూడా వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

**తీసుకోవాల్సిన జాగ్రతలు**

ఆస్తమా బారిన పడకుండా ఉండేందుకు ఇంట్లో దుమ్ము, ధూళి లేకుండా చూసుకోవాలి. పొగ, మద్యపానం వంటి వాటికి దూరంగా ఉండాలి. చలి కాలంలో చల్లని నీటితో స్నానం చేయకూడదు. చలిగాలిలో ఎక్కువగా తిరగరాదు. గోరు వెచ్చని నీటిని తాగాలి. పిల్లి, కుక్క వంటి జంతువులకు దూరంగా ఉంటే మంచిది. మసాలాలు, శీతల పానీయాలు సేవించకూడదు. చాక్లెట్లు, గోంగూర, వంకాయ వంటి మనకు పడని వస్తువులను తినకూడదు. ఘాటు వాసన కలిగిన సెంట్లు స్ప్రేలకు దూరంగా ఉంటూ తగు జాగ్రతలను తీసుకుంటే కొంత వరకు మనం ఆస్తమాను కంట్రోల్‌లో ఉంచుకొనవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

**జాగ్రతలు తీసుకోవాలి**



ఆస్తమాతో బాధపడే వారు ముఖ్యంగా చలికాలంలో తగు జాగ్రతలను తీసుకోవాలి. చలి ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగక పోవడం మంచిది. డస్ట్ అలర్జీతో బాధపడే వారు దుమ్ము ధూళి ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. మన పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చలికాలంలోనే ఎక్కువగా ఉంటుంది కనుక డాక్టర్లను సంప్రదించాలి. వారి సలహాల మేరకు మందులను వాడుతూ తగిన జాగ్రతలను తీసుకుంటే మంచిది. – సత్యవతి ఉప వైద్యాధికారి

## క్లుప్తంగా

### 12 నుంచి హనుమద్ వ్రతం



మంగరాయ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు హనుమద్‌వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ కొమ్రేష్ ఆచార్ గురువారం తెలిపారు. మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థ శ్రీపాదులవారి ఆదేశాల మేరకు 12వ తేదీన స్వామివారికి నిర్మల్య విసర్జనం, పంచామృతాభిషేకం, గోపూజ, ధ్వజారోహణం, లక్ష్మి, ధాన్యపూజ, 13న హనుమద్వ్రత శ్రావణం , పవమాన హోమం, 14న సుదర్శన హోమం , విశేష క్షీరాభిషేకం, 15న మహారథోత్సవం, సామూహిక సత్యనారాయణ వ్రతం, 16న ఫల పంచామృతాభిషేకం, పల్లకిసేవ, అవభ్రుత స్నానం కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

### ఇళ్ల నిర్మాణాల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్: ఆదోని మండలంలోని ధణాపురం గ్రామ సమీపంలోని హౌసింగ్ కాలనీని మున్సిపల్ కమిషనర్ కృష్ణ గురువారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులు, ఇసుక నాణ్యతగా ఉందా లేదా అన్న దానిపై పరిశీలన చేశారు. నిబంధనల మేరకే ఇళ్లను నిర్మిస్తున్నారా లేదానని విషయాలపై బేల్దారులను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ బోర్డు అధికారుల సూచన మేరకే పనులను కొనసాగిస్తున్నామని కమిషనర్ చెప్పారు.

**పాత బస్టాండులో పారిశుద్ధ్య పనులు**

ఆదోని టౌన్ : మున్సిపాలిటీలో మురుగు కాలువల్లో చెత్తాచెదారం, పూడికను ఏరోజుకారోజు ఎత్తివేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. గురువారం పాత బస్టాండు ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వార్డు సచివాలయం, ఎల్‌బీ స్ట్రీట్, పీఎన్ రోడ్డు ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో పూడికతీత పనులను దగ్గరుండి చేయించారు.

### ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని సందడిగా మారాయి. భక్తులు స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలను, ప్రార్థనలు జరుపుకున్నారు. పిండి వంటలు వండి స్వామికి నైవెద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

### ఘనంగా మారెమ్మ దేవి ఊరేగింపు



ఊరేగింపులో మారెమ్మ దేవి

కోసిగి: మండల కేంద్రంలోని కడపాలెం వీధిలో నూతనంగా నిర్మించిన మారెమ్మ దేవి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టనున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాల మధ్య ఊరేగించారు. మహిళలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి చేర్చారు. శుక్రవారం హోమం, వేద పండితులతో ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

### ఇంజినీరింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ శాఖలో పని చేస్తున్న ఇంజినీరింగ్ వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని స్థానిక ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నారాయణ, శివరామకృష్ణ, నరసప్ప డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్షకు పూనుకున్నారు. వారు మాట్లాడుతూ టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. 15 సంవత్సరాల సర్వీసు ఉన్న కార్మికులను క్రమబద్ధీకరించాలని, జాతీయ, రాష్ట్ర పండుగలను సెలవులుగా ప్రకటించాలని లేదా వేతన దినాలుగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జాకీర్, వీరేష్, శివన్న, జనార్దన్, రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి స్మారక అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకొని ఆడాలని సూచించారు. పోటీల్లో 136 జట్లు పాల్గొననుండటం హర్షించదగ్గవిషయమన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు సురేష్‌చౌదరి, రంగస్వామి గౌడ్, దోమ భీమేష్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధం ఉదయం 8 నుంచి రాత్రి 7గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో పట్టణ కార్యదర్శి విజయ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 8గంటలకే పాఠశాలలు ప్రారంభిస్తున్నందున విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. అదేవిధంగా ర్యాంకులు సాధించకుంటే జీవితం వ్యర్థం అంటూ విద్యార్థులపై ఒత్తిడి పెంచుతూ యాజమాన్యాలు స్పెషల్ క్లాసులు, పరీక్షలు తప్పవంటూ అదనపు ఫీజులు వసూలు చేస్తునారని ఆరోపించారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రవితేజ, ఉదయ్, అఖిల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిపై దాడి దురదృష్టకరం



సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుడిపై దాడి చేసి హత్య చేయడం దురదృష్టకరమని ఎస్టీయూ రాష్ట్ర సహ అధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి. వీరచంద్ర యాదవ్ అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్టీయూ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గతంలో ఎప్పుడు జరగని విధంగా ఇలాంటి ఘటన ఆంధ్రప్రదేశ్‌లో జరగడం దారుణమన్నారు. ఈ హత్యపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఉపాధ్యాయుడి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టాలను చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రవి, లోక్యనాయక్, సుధాకర్, భీమరాజు, రాజా, సతీష్, కలిల్, గురురాజా తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులకే రక్షణ లేకపోతే ఎలా?**

గోనెగండ్ల : దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులకే రక్షణ లేకపోతే ఇక రాబోవు కాలంలో ఈ దేశం అంధకారంలోనికి వెళ్తుందని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి శ్రీధర్ అన్నారు. గురువారం గోనెగండ్లలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటి లోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత ఉర్దూ పాఠశాలలో భౌతిక శాస్త్రం పాఠశాల సహాయకులుగా పనిచేసే ఎజాస్ అహ్మద్‌ని అదే పాఠశాలకు చెందిన విద్యార్థులు దాడి చేసి హత్యచేశారు. ఈ సంఘటనను సామాజిక మాధ్యమాల్లో చూసి మనసు చలించి పోయిందన్నారు. దీనిని ఉపాధ్యాయులంతా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్రుడు, చంద్రశేఖర్, ఆర్థిక కార్యదర్శి గోవర్ధన్ పాల్గొన్నారు.

**ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య**

ఎమ్మిగనూరుటౌన్: అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉపాధ్యాయుడు ఎజాస్‌పై విద్యార్థులు దాడి చేయడం హేయమైన చర్య అని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు మల్లికార్జున, రాజు, శంకరప్ప, నబి, నాగేంద్రకుమార్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాల తొలగింపు



మార్కండేయస్వామి గుడి ఏరియాలో అక్రమ కట్టడాలను జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: పట్టణంలో అక్రమ కట్టడాల కూల్చివేతకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీకారం చుట్టారు. గురువారం స్త్రీ, పిల్లల ఆస్పత్రి ముందు, ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన అక్రమంగా వేసుకున్న కొబ్బరిబోండాల అంగళ్లను తొలగించారు. చిన్నమార్కెట్, మార్కండేయస్వామి గుడి వద్ద అక్రమ కట్టడాలను కూల్చివేశామని టౌన్ ప్లానింగ్ అధికారి బాలమద్దయ్య తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందికలగడం వల్లనే కట్టడాలను కూల్చివేసినట్లు వెల్లడించారు. మున్సిపల్ నిబంధనల మేరకే వ్యాపార సముదాయాలు, ఇళ్లు, టీ హోటళ్లు, బీడీ బంకులు తదితర వాటిని ఏర్పాటు చేసుకోవాలని టీపీఓ సూచించారు. అయితే మార్కండేయస్వామి గుడి ఏరియాలో కొంతమంది వ్యాపారులు నిరసన తెలియజేశారు.

## క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న వైద్యులు

ఆదోనిటౌన్/ఆదోని సెంట్రల్: పట్టణంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద పేద క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని గురువారం పంపిణీ చేశారు. స్థానిక టీబీ యూనిట్ డాక్టర్ షేకున్‌బాను, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ వాణి శ్రీ, సూపర్‌వైజర్ బాబురాజు క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. మధు ఆస్పత్రి డాక్టర్లు మనీషా సౌజన్యంతో పేద క్షయవ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని ఒక్కొక్కరికి రూ.1000 విలువ గల పౌష్టికాహారాన్ని అందజేశారు. ఒక్కొక్క వ్యాధిగ్రస్తుడికి ఆరు నెలపాటు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని డాక్టర్ షేకున్‌బాను తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి టీబీ బాధితులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా టీపీఎం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉమాపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వలసబాట పట్టిన కుప్పగల్



ఆటోలో వలస వెళ్తున్న గ్రామస్తులు

ఆదోని రూరల్: స్థానికంగా వ్యవసాయ పనులు, కూలీ పనులు, ఉపాధి హామీ పనులు లేకపోవడంతో గ్రామాల్లోని ప్రజలు పట్టణాలకు వలసబాట పడుతున్నారు. గురువారం ఆదోని మండలంలోని కుప్పగల్ గ్రామంలో దాదాపు వంద కుటుంబాలకు పైగా కర్ణాటక రాష్ట్రానికి తరలివెళ్లారు. గ్రామంలో వ్యవసాయ పనులు పూర్తి కావడంతో పనులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఆదుకోవాల్సిన ఉపాధి హామీ పనులు సైతం రాజకీయాలు అడ్డొచ్చి నిలిపివేశారు. దీంతో కూలీకి పోతే పూట గడవదని, స్థానికంగా పనులు లేకపోవడంతో చేసేదేమిలేక వలసబాట పట్టాల్సిన పరిస్థితి నెలకొందని కూలీలు ఈరమ్మ, గిడ్డయ్య, రంగమ్మ, నాగలక్ష్మి తదితరులు తెలిపారు.

## బాల్యవివాహాలతో అనర్థాలు



స్కాట్, ఎన్‌సీసీ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీడీపీఓ

ఎమ్మిగనూరుటౌన్: బాల్య వివాహాలతో అనర్థాలే ఎక్కువ అని, చదువుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని సీడీపీఓ సఫరున్నిసా బేగం అన్నారు. బేటీ బచావో–బేటి పఢావో కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలతో జరిగే నష్టాలు, చదువుతో ఒనగూరే లాభాలపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలికలు చదువుకోవడం ద్వారా ఆత్మస్థైర్యం, ధైర్యం, జ్ఞానం, మంచి ప్రవర్తన అలవడుతుందని తెలిపారు. పలు క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి, పీడీలు సుజనాకుమారి, నాగేశ్వరి, ఉపాధ్యాయురాలు సోమసుందరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నీలమ్మ, సుజావతి తదితరులు పాల్గొన్నారు.

## గంజెళ్లకు పాదయాత్ర



గంజెళ్ల గ్రామానికి పాదయాత్రగా వెళ్తుతున్న పీఠాధిపతులు, భక్తజన బృందం

పెద్దకడబూరు : మండల కేంద్రంలో వెలసిన శ్రీముద్దరంగా గురువుల మఠం నుంచి పీఠాధిపతులు మఠం రంగప్పస్వామి, శిష్య బృందం గోనెగండ్ల మండలం గంజెళ్ల గ్రామానికి గురువారం పాదయాత్రగా వెళ్లారు. ఉదయం ముద్దరంగా గురువులకు ప్రత్యేక పూజల అనంతరం పాదయాత్ర ప్రారంభించారు మఠం పీఠాధిపతులు రంగప్పస్వామి మాట్లాడుతూ గంజెళ్ల శ్రీవెంకటాగురువుల మఠం పీఠాధిపతులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గంజెళ్ల గ్రామంలో వెలసిన వెంకటాగురువుల 155వ ఆరాధన మహోత్సవం గురు, శుక్రవారాల్లో జరుగుతుందన్నారు. పాదయాత్రలో శ్రీనివాసస్వామి, బ్రహ్మానందస్వామి, గురుమూర్తిస్వామి, వెంకటనారాయణస్వామి, నారాయణస్వామి, మహిళలు భక్త బృందం పాల్గొన్నారు.

## ప్రశాంతంగా రైల్వే ఎన్నికలు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఉద్యోగులు

ఆదోని సెంట్రల్: దక్షణ మధ్య రైల్వే పరిధిలోని గుర్తింపు పొందిన సంఘాలకు ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఐదు ఉద్యోగ సంఘులకు చెందిన నాయకులు పోటీల్లో నిలబడ్డారు. గుంతకల్ డివిజన్ పరిధిలోని ఆదోని పోలింగ్ బూత్‌లో మంత్రాలయం, మొలగవల్లి, ఆస్పరి, నగరూర్, కుప్పగల్ స్టేషన్లకు చెందిన వివిధ శాఖల ఉద్యోగులు 277 మంది ఉడంగా.. రెండు రోజులుగా జరుగుతున్న పోలింగ్‌లో ఓటు హక్కును వినయోగించుకున్నారు. బుధవారం జరిగిన పోలింగ్‌లో 141 మంది, గురువారం 101 మంది తమ ఓటు వేశారు. మొత్తం 242 ఓట్లు పోలైనట్లు పోలింగ్ అధికారి అమిత్ కుమార్ తెలిపారు. సికింద్రాబాద్‌లో 12వ తేదీ ఓట్లు లెక్కింపు ఉంటుందన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రైల్వే ఎస్ఐ. గోపాల్, టూటౌన్ ఎస్ఐ తిరుపాల పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేశారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం సాయంత్రం సబ్‌కలెక్టర్ వారి కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, రైతులతో రెవెన్యూ సదస్సుపై సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూవివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. గ్రామాల్లో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. ఈ మేరకు సెక్షన్ 22ఏ భూ ఆక్రమణలు, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి బాధిత రైతులు రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి, మండలంలో జిల్లాస్థాయి అధికారి నోడల్ ఆఫీసర్‌లుగా రెవెన్యూ సదస్సుల్లో పాల్గొంటారన్నారు. ఆదోని డివిజన్‌లోని 9 మండలాల్లో 222 గ్రామ సదస్సులు 33 రోజుల పాటు నిర్వహిస్తున్నామని చెప్పారు. రెవెన్యూ సదస్సుల సందర్భంగా స్వీకరించే ఫిర్యాదులన్నిటినీ రియల్ టైమ్ గవర్నెస్ సొసైటీ రూపొందించిన గ్రీవెన్స్ రిడ్రెసల్ పోర్టల్‌లోని ప్రత్యేక విండోలో ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాన్నారు. సదస్సులో స్వీకరించిన ప్రతి అర్జీకి రశీదు ఇవ్వడంతోపాటు స్వీకరించిన అర్జీలను 45 రోజుల్లో పూర్తిస్థాయిలో విచారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ సూచించారు.

**సద్వినియోగం చేసుకోండి**

ఎమ్మిగనూరురూరల్: మండలంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నేటి నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సులో భూ సమస్యలుంటే ఫిర్యాదు చేసుకోవచ్చునని, పరిశీలించి పరిష్కరించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. శుక్రవారం గుడేకల్ గ్రామంలో సదస్సు ఉంటుందన్నారు.

## నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

నందవరం : మండలంలోని అన్ని గ్రామాల్లో నేటి నుంచి జనవరి 4వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. 6న నదికైరవాడి, 7న కనకవీడు, 10న సోమలగూడూరు, 11న ముగతి, 12న హాలహర్వి, 13న ధర్మపురం, 17న నందవరం, 18న మాచాపురం , 19వ తేదీ ఇబ్రహీంపురం, 20న నాగలదిన్నె, 21న పూలచింత, 24న గంగవరం, 26న జొహరాపురం, 27న గురజాల, 28న మిట్టసోమపురం, 31న పెద్దకొత్తిలి, జనవరి 2వ తేదీ రాయచోటి, 3న పోనకలదిన్నె, 4న చిన్నకొత్తిలి గ్రామంలో సభలు ఉంటాయన్నారు.

పెద్దకడబూరు : మండలంలోని 18 రెవెన్యూ గ్రామాలలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతున్నట్లు తహసీల్దారు శ్రీనాథ్ పేర్కొన్నారు. 06న నౌలేకల్లు, 09న చిన్నతుంబళం, 10న బాపులదొడ్డి, 11న బసలదొడ్డి, 12న తారాపురం, 13న రంగాపురం , 17న చిన్నకడబూరు, 18న గవిగట్టు, 19న పీకలబెట్ట, 20న హంలికన్వీ, 21న ముచ్చగిరి, 27న మేకడోణ, 28న కల్లుకుంట, జనవరి 02న కంబలదిన్నె, 03న హెచ్.మురవణి, 04న కంబదహాల్, 07న పెద్దకడబూరు, 08న జాలవాడి గ్రామాలలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## రేపు మెగా పేరెంట్స్ మీటింగ్

గోనెగండ్ల : ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ మీటింగ్‌ను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేరెంట్స్ మీటింగ్‌లో విద్యార్థుల చదువు, పాఠశాల అభివృద్ధి, తల్లిదండ్రుల పాత్ర గురించి చర్చించి పాఠశాలలో చేయాల్సిన అభివృద్ధి గురించి మాట్లాడటం జరుగుతుందన్నారు. పాఠశాలలో జరిగే పేరెంట్స్ మీటింగ్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, పెద్దలు, పూర్వ విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## రసాయన ఎరువులతో నేల నిస్సారం



భూసారాన్ని పరీక్షిస్తున్న కో-ఆర్డినేటర్ డా. రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: వ్యవసాయంలో ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడితే భూసారం తగ్గిపోతుందని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. రాఘవేంద్రచౌదరి అన్నారు. గురువారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి సాధించాలనే ఆత్రుతతో మితిమీరి రసాయన ఎరువులు వాడుతున్నారని, అధికమోతాదులో ఎరువులు వాడకం వలన కొన్ని రోజులకు భూసారం తగ్గిపోయి, భూమి లవణీయతను కోల్పోతుందని తెలిపారు. ఫలితంగా దిగుబడులు గణనీయంగా పడిపోతాయని హెచ్చరించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రపంచ నేల దినోత్సవంపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే రైతులకు భూసార పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. చందన, డా. మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలల్లో విద్యపై ఆసక్తి పెంచాలి



కోసిగిలో చిన్నారులతో ఆటపాటలతో విద్యపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కోసిగి: ప్రీస్కూల్ నుంచే పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్యను బోధిస్తూ వారిలో చదువుపై ఆసక్తి పెంచాలని కోసిగి కుమ్మరి వీధి పాఠశాల హెచ్‌ఎం హేమంత్ బాబు, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర రెడ్డి అన్నారు. గురువారం స్థానిక 13వ అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే కార్యక్రమంలో భాగంగా చిన్నారులు, తల్లిదండ్రులకు అవగాహన నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 ఏళ్ల నుంచి 5 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలకు బొమ్మలు, ఆట వస్తువుల చూపిస్తూ బాలగేయాలతో విద్యను నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లూసమ్మ, వరలక్ష్మి, జ్యోతి, భీమలింగమ్మ, దేవి, ఎంఎల్‌హెచ్‌పీ యువరాజు, ఆశావర్కర్ రామకృష్ణమ్మ పాల్గొన్నారు.